# నవతరం పరిశోధనలు -10



## తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనాసాహిత్యం

**కొలుకుల రజిత**, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్, తెలంగాణ

**సెల్** : 7569856191. **మెయిల్** : kolukularajitha@gmail.com

**కోర్సు**: Ph.D. **రీసెర్చ్ ఏరియా**: సాహిత్యం / సంకీర్తన సాహిత్యం

**పర్యవేక్షకులు**: డా.సి.హెచ్.లక్ష్మణ చక్రవర్తి. **పరిశోధన కాలం**: 2022 నుండి 2027

ప్రాచీన భగవంతుని స్వరూప స్వభావాలను మృదు మధుర శైలిలో, గానరూపంలో వ్యక్తం చేసే సంకీర్తనలకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో త్యాగయ్య, అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, పురందరదాసు, ముత్తుస్వామి దీక్షితులు వంటి మహనీయులు ప్రధానంగా కనిపిస్తారు. భారతీయ సంప్రదాయానికి, ఆధ్యాత్మికతకు పట్టుకొమ్మగా నిలిచే సంకీర్తన సాహిత్య ప్రస్థానంలో 1960 దశకానికి చెందిన తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ (నిజామాబాద్ జిల్లా) గారు చేసిన కృషి అనిర్వచనీయం. సుమారు వీరి ముద్రిత సంకీర్తనలు 19 సంపుటాలుగా వెలువడ్డాయి. వీటిలో ఆధ్యాత్మిక, శృంగార, భక్తి వంటి భిన్న భావాలు కనిపిస్తాయి. వీటన్నింటినీ విశ్లేషించి కొలుకుల రజిత, తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో, డా. సి. హెచ్. లక్ష్మణ చక్రవర్తి గారి ఆధ్వర్యంలో తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనా సాహిత్యం అనే అంశం పైన పిహెచ్. డి. చేస్తున్నారు.

వీరు తమ పరిశోధనను ప్రాథమికంగా తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ జీవితం, రచనలు; తెలంగాణలో సంకీర్తనలు - ప్రారంభ వికాసాలు; తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తన సాహిత్యం - వస్తు విశ్లేషణ; తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లో ప్రయోగ విశేషాలు; తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లో అలంకారాలు, ఛందస్సు, పూర్వకవుల అనుకరణలు; తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లో భాషా, వ్యాకరణాంశాలు అని ఆరు అధ్యాయాలుగా విభజించారు.

వీరు తమ పరిశోధన గూర్చి తెలియజేస్తూ 'తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తన సంపుటాలు సేకరించడంలో ఎలాంటి సమస్య లేదు అన్ని ముద్రితమయ్యే ఉన్నాయి. కానీ వారి రచనల్లో సంకీర్తన లక్షణాన్ని వెతుక్కోవడం, సంకీర్తన లక్షణానికి అన్వయించి చూపడం క్లిష్టంగా ఉంటుంది . ఆపైన స్వేచ్ఛగా , శృంగార భావాల్ని శ్రుతి మించి వ్యక్తం చేయడం వల్ల పరిశోధనలో ఈ అంశాలను ప్రస్తావించడం క్లిష్టంగా అనిపించింది' అన్నారు.

ఈ మధ్యకాలంలో జానపదంతో పాటు తెలంగాణ సంకీర్తనసాహిత్యం పై సిద్ధాంత గ్రంథాలు వెలవడుతున్నప్పటికీ, ఇంతవరకూ తాళ్ల లక్ష్మీనారాయణ గౌడ్ గారి సాహిత్యం పైన పరిశోధన జరగలేదు. ఈ ఖాళీని పూరించాలనే సదుద్దేశంతో వీరు చేస్తున్న ఈ పరిశోధన వర్తమాన, భావి పరిశోధకులకు స్ఫూర్తిదాయకం. స్థానిక సాహిత్య చరిత్రల నిర్మాణానికి ఇలాంటి పరిశోధనలు ఎంతగానో ఉపకరిస్తాయి.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 11



## సాహిత్యచరిత్రలు : తెలంగాణసాహిత్యం

**కావలి రాఘవేందర్,** తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.
**సెల్:** 9704088716. **మెయిల్:** rk9704088716@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** విమర్శ
**పర్యవేక్షకులు:** ఆచార్య సూర్యాధనంజయ్. **పరిశోధనకాలం:** 2018 నుండి 2025

కావలి రాఘవేందర్ కు చిన్నతనం నుండే చరిత్ర అంశాలపై ఆసక్తి ఎక్కువ. ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న కాలంలో తెలంగాణ–ఆంధ్ర అస్తిత్వ చర్చలు విస్తృతంగా జరగడం, రాజకీయ ఉపన్యాసాలలో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి తరచుగా వినిపించడం వంటి కారణాలు ఈ పరిశోధనకు ప్రేరణగా నిలిచాయన్నారు. సాహిత్య సదస్సులలో తెలంగాణ సాహిత్యానికి, తెలంగాణ కవులకు తగిన గుర్తింపు లేదని పలువురు వక్తలు పేర్కొనడం, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగా చురుకుగా పాల్గొనడం వల్ల వీరిలో ఈ భావాలు బలపడ్డాయన్నారు. ముఖ్యంగా తెలుగు సాహిత్య చరిత్రలలో తెలంగాణ సాహిత్యం ఎందుకు విస్మరించబడింది? సాహిత్య చరిత్ర నిర్మాణంలో జరిగిన లోపాలు ఏమిటి? అనే ప్రశ్నలు తన పరిశోధనకు కేంద్రబిందువయ్యాయన్నారు. 2017లో తెలంగాణ తెలుగు మహాసభల సందర్భంలో తెలంగాణ సాహిత్య అకాడమీ వెలువరించిన గ్రంథాల నిర్మాణ ప్రక్రియలో పాల్గొనడం ద్వారా సాహిత్య చరిత్ర రచన పద్ధతులను దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించడంతో పరిశోధన ఆసక్తి మరింత బలపడిందన్నారు. వీరు ఆసక్తికి తగినట్లుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఆచార్య సూర్యధనంజయ్ గారి ఆధ్వర్యంలో "సాహిత్య చరిత్రలు – తెలంగాణ సాహిత్యం" అనే అంశం పై పిహెచ్.డి చేస్తున్నారు.

తెలుగు సాహిత్య చరిత్రలలో తెలంగాణ సాహిత్యం ఎంతవరకు నమోదై ఉందో నిర్ధారించడం వీరి పరిశోధన ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణ కవుల వివరాలు, వారి రచనలు సాహిత్య చరిత్రలలో ఎంత మేరకు చోటు దక్కించుకున్నాయో పరిశీలించడం, ఏ కాలానికి చెందిన తెలంగాణ సాహిత్యం ఎక్కువగా ప్రస్తావించబడిందో విశ్లేషించడం. ఈ పరిశోధన లక్ష్యాలలో ముఖ్యమైనవి. మొత్తం 25 సాహిత్య చరిత్రలను ప్రాథమికంగా పరిశీలించినప్పటికీ, స్థల–కాల పరిమితులను దృష్టిలో ఉంచుకొని మొత్తం తొమ్మిది సాహిత్య చరిత్రలను పరిశోధన పరిధిగా ఎంచుకున్నారు. ఈ పరిశోధనకు వీరు తులనాత్మక అధ్యయన పద్ధతి, విశ్లేషణాత్మక పద్ధతి, చారిత్రక, వర్ణనాత్మక పద్ధతులను ఎంచుకున్నారు. ప్రాథమిక స్థాయిలో వీరు తమ పరిశోధనను అయిదు అధ్యాయాలుగా విభజించారు. అవి : సాహిత్య చరిత్రల పరిచయం; 19వ శతాబ్దం సాహిత్య చరిత్రలు - తెలంగాణ ప్రస్తావన; 20వ శతాబ్దం సాహిత్య చరిత్రలు - తెలంగాణ ప్రస్తావన, 21వ శతాబ్దం సాహిత్య చరిత్రలు - తెలంగాణ ప్రస్తావన.

ఈ పరిశోధన తెలంగాణ సాహిత్యాన్ని నూతన దృక్పథంతో అధ్యయనం చేయడానికి ప్రేరణగా నిలుస్తుంది. అంతిమంగా తెలుగు సాహిత్య చరిత్రను సమగ్రంగా పునర్నిర్మించాలనే ఆలోచనకు మార్గదర్శకం అవుతుంది.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 12



## కర్నూలుజిల్లా జానపదగేయాలలో సామాజికదృక్పథం: ఒక పరిశీలన

**బి. మాధవీలత,** తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం, ఆంధ్రప్రదేశ్.
**సెల్:** 8125638895. **మెయిల్:** lakshmimadhu51@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** జానపద సాహిత్యం
**పర్యవేక్షకులు:** ఆచార్య జి. నరసింహన్. **పరిశోధనకాలం:** 2022 నుండి 2027

చిన్నతనం నుంచే జానపద గేయాలపై ఏర్పడిన ఆసక్తి, స్నాతక మరియు స్నాతకోత్తర స్థాయిలో జానపద సాహిత్య గ్రంథాలను అధ్యయనం చేసిన అనుభవం ఆలంబనగా బి. మాధవీలత "కర్నూలు జిల్లా జానపద గేయాలలో సామాజిక దృక్పథం ఒక పరిశీలన" అనే అంశంపై పరిశోధన చేస్తున్నారు. ఈ పరిశోధన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో, ఆచార్య జి. నరసింహన్ గారి పర్యవేక్షణలో కొనసాగుతోంది. ప్రాంతీయ జానపద సంపదను సామాజిక కోణంలో అర్థం చేసుకోవడం, దానిలోని సామాజిక ప్రతిబింబాలను గుర్తించడం అనే లక్ష్యం ఈ పరిశోధన సాగుతుంది.

జానపద సాహిత్య పరిశోధన అంటేనే క్షేత్రపర్యటన! అనే సూత్రాన్ని ఆధారంగా చేసుకొని మాధవీలత కర్నూలు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ. జిల్లా మొత్తాన్ని పరిశోధనా క్షేత్రంగా తీసుకొని గ్రామ గ్రామాలను శోధిస్తూ, అక్కడి జానపద గాయనీ-గాయకుల నుండి గేయాలను ప్రత్యక్షంగా సేకరించడం ద్వారా ఈ పరిశోధనను ముందుకు తీసుకెళుతున్నారు. క్షేత్రస్థాయిలో గేయాలను సేకరించడం, వాటిని నమోదు చేయడం, వర్గీకరించడం, సామాజిక దృక్పథంతో విశ్లేషించడం వల్ల ద్వారా జానపద గేయాల అసలైన స్వరూపం, సామాజిక వాస్తవికత, ప్రజాజీవనం వంటి లక్షణాలు మరింత స్పష్టంగా బయటపడే అవకాశం ఉంది.

కర్నూలు జిల్లా జానపద గేయాలను సామాజిక దృక్పథంతో విశ్లేషించడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. జానపద గేయాలు కేవలం వినోద సాధనాలు కాకుండా ప్రజల జీవన విధానం, సామాజిక వ్యవస్థ, ఆచారాలు, నమ్మకాలు, కుటుంబ నిర్మాణం, వృత్తులు, మానవ సంబంధాలు, లింగభేదం, ఆర్థికస్థితి, ప్రాంతీయ సాంస్కృతిక భావాలు మొదలైన అనేక అంశాలకు ప్రతిబింబాలుగా ఉంటాయి. కాబట్టి ఈ గేయాలలో వ్యక్తమయ్యే సామాజికాంశాలను శాస్త్రీయంగా గుర్తించి, వాటిని తగిన ఆధారాలతో విశ్లేషిస్తూ వీరు ఈ పరిశోధనను ముందుకు తీసుకువెళ్తున్నారు.

వీరు తమ సిద్ధాంత గ్రంథాన్ని ప్రాథమికంగా అయిదు అధ్యాయాలుగా విభజించారు అవి : సమాజం; కర్నూలు జిల్లా ప్రవేశిక; కర్నూలు జిల్లా జానపద గేయాల వర్గీకరణ; కర్నూలు జిల్లా జానపద గేయాలు : సామాజికాంశాలు; కర్నూలు జిల్లా జానపద గేయాలు : భాష. ప్రాంతీయ (జిల్లాల) ప్రాతిపాదికన జానపద పరిశోధనలు చేయడానికి, ప్రజాసాంస్కృతిక సంపదను రికార్డ్ చేయడానికి, స్థానిక భాషా, సామాజిక విశిష్టతలను గుర్తించడానికి ఈ పరిశోధన ప్రేరణగా నిలుస్తుంది

**- సంపత్ కుమార్ బానోజి**

**(మరికొన్ని పరిశోధనల పరిచయం వచ్చే సంచికలో…)**